క్లుప్తంగా

చేతుల పరిశుభ్రత ముఖ్యం



తెనాలిఅర్బన్: చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ జేఆర్ అప్పలనాయుడు, ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ మొవ్వా యేసుబాబులు సూచించారు. గ్లోబల్ హ్యాండ్ వాష్‌డే వేడుకలను బుధవారం కొత్తపేటలోని మహిళా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతుల్లో బ్యాక్టీరియాలు దాగి ఉంటాయని చెప్పారు. భోజనానికి ముందు తప్పని సరిగా చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. సమావేశంలో మెప్మా సీఎంఎం విజయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వల్లో వ్యర్థాలు వేయకండి



తెనాలిఅర్బన్: కాల్వల్లో వ్యర్థాలు వేయడం వలన పారుదల నిలిచిపోతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 18వ వార్డులో బుధవారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. వార్డులోని మురుగు కాల్వల పూడికతీత పనులు చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాల్వల్లో వ్యర్థాలు వేయవద్దని ప్రజలకు సూచించారు. అలాగే కాల్వలపై ఎటువంటి రాళ్ల ఏర్పాటు చేయవద్దు అన్నారు. ఆమె వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



తెనాలిఅర్బన్: సీపీఆర్ పద్ధతిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లావైద్యశాల వైద్యుడు గణేష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా వైద్యశాలలోని మెడికల్ ఓపీ వద్ద బుధవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా గుండెనొప్పి సంభవిస్తే వెంటనే సీపీఆర్ చేయాలని సూచించారు. కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు దీనిపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



తెనాలిఅర్బన్: అనాథ మృతదేహానికి శ్రీ శివ లింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు బుధవారం సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలోకి వెళితే.. రేవేంద్రపూడి – వడ్లమూడి గ్రామాల మధ్యన గుర్తు తెలియని మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. అతని ఆచూకీ కోసం విచారణ జరిపారు. వివరాలు లభించకపోవడం, అనాథగా తేలడంతో పోలీసులు శ్రీ శివ లింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనును సంప్రదించి అంత్యక్రియలు నిర్వహించాలని కోరారు. సభ్యులు బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. సమితి సభ్యులు మల్లెల వాసు, ఆవులమంద ప్రసాద్, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ

ఫిరంగిపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌జీఎస్‌ఏ- ఎల్‌ఎస్‌డీజీ 5లో భాగంగా పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మూడురోజుల శిక్షణ బుధవారంతో ముగిసింది. ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పారిశుధ్యం, పరిసరాల శుభ్రత, తడి, పొడి చెత్త వేరు చేయడం వల్ల కలిగే లాభాలు, పచ్చదనం పెంపొందించేందుకు పాటించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఏపీఎం నాగేశ్వరరావు, డ్వాక్రా వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

17న మహా ధర్నాను జయప్రదం చేయండి

మంగళగిరి టౌన్: పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్ వెంటనే అమలు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.రవి డిమాండ్ చేశారు. మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన దీక్ష బుధవారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రభుత్వ తీరును విమర్శించారు.

అబ్దుల్ కలాం జీవితం నేటితరానికి ఆదర్శం

- మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

తెనాలి: భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్ర విజ్ఞానంలో భారతదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతిని నిర్వహించారు. అబ్దుల్ కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ అతిసామాన్య కుటుంబంలో జన్మించి జీవనం కోసం చిన్న చిన్న పనులు చేసిన అబ్దుల్ కలాం పట్టుదలతో కష్టపడి చదువుకుని దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త అయ్యారనీ, ఆయన చిత్తశుద్ధి, కార్యదక్షతతో దేశ రాష్ట్రపతి పదవినే చేపట్టినట్టు గుర్తుచేశారు. కష్టాలెన్ని ఎదురైనా చెదరని సంకల్పంతో లక్ష్యాన్ని చేరుకోవటానికి యువతరం కలాం జీవితాన్ని తెలుసుకోవాలని సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గోల్డ్ రహిమా, నియోజకవర్గ మైనారిటీ విభాగం అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, పట్టణ అధ్యక్షుడు షేక్ పెచ్చింగ్ సుభాని, రూరల్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు షేక్ ఖాజా, షేక్ అన్సారీ, ఈద్గా గౌస్, షేక్ సాదిక్, షేక్ మీరావలి, షేక్ ఆసిఫ్, షేక్ అజ్మల్, పఠాన్ అసద్, షేక్ యూసఫ్, సలీమ్, సుభానీ యూత్, మౌలాలి, సయ్యద్ ఖలీల్, షేక్ జిలాని తదితరులు పాల్గొన్నారు.



భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శివకుమార్, మైనారిటీ నేతలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో..

తెనాలి: స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక కార్యాలయంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం తమిళనాడు రాష్ట్రంలో రామేశ్వరం పట్టణంలో జన్మించి ఒక పేపర్ బాయ్ నుంచి రాష్ట్రపతిగా, శాస్త్ర సాంకేతిక విజ్ఞానంలో తనదైన శైలిలో చరిత్ర సృష్టించారని సోదాహరణంగా వివరించారు. భారత ప్రభుత్వం ఆయనకు అత్యున్నతమైన 'భారతరత్న'తో సత్కరించినట్టు తెలిపారు. అబ్దుల్ కలాం మొదటి నుంచి యువత, చిన్నారుల పట్ల ఎంతో ప్రేమ కలిగి ఉన్నారనీ, వారిలో సజనాత్మకతను పెంపొందించడానికి ఎంతో కృషిచేశారని వివరించారు. తొలుత కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కుర్రా జస్వంత్ యాదవ్, కామాదుల స్వామి, పొట్లూరి అశోక్, యాతాటి అనిల్, మైలా విజయ్‌నాయుడు, అరవపల్లి సిరికృష్ణ, షేక్ జిలాని పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక నాయకులు

అబ్దుల్ కలాంకు ఘన నివాళి..

తెనాలిరూరల్: మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియాగా పిలువబడిన ఏకైక వ్యక్తి డా.ఏపీజే అబ్దుల్ కలాం అని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్ కొనియాడారు. మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి రామలింగేశ్వరపేటలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఘన నివాళులర్పించారు. జొన్నాదుల మహేష్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మొహిద్దీన్, పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి

బాణసంచా విక్రయాలపై ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి

తెనాలి: దీపావళి పండుగకు తెనాలి డివిజన్‌లో లైసెన్స్ కలిగిన హోల్‌సేల్ వ్యాపారులు, తాత్కాలిక లైసెన్సులు తీసుకునేవారు తగిన నియమ నిబంధనలు తప్పక పాటించాలని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి స్పష్టంచేశారు. దీపావళి బాణసంచా విక్రయాలకు సంబంధించి బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో తెనాలి డివిజన్ స్థాయి రెవెన్యూ, పోలీస్, ఫైర్, జీఎస్టీ ఇతర శాఖల అధికారులతో జరిగిన సమావేశానికి లక్ష్మీకుమారి అధ్యక్షత వహించారు. తాత్కాలిక లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకునేవారు తగిన సూచనలు పాటించాలనీ, లైసెన్సు వచ్చాక తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. దీనిపై సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివిజనులో మండల తహసీల్దార్లు, పోలీసు అధికారులు ఫైర్ స్టేషన్ అధికారులు, జీఎస్టీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నిరసన ర్యాలీ

ఫిరంగిపురం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఫిరంగిపురంలో ఈనెల 17న నిరసన ర్యాలీ జరగనుంది. సీజేఐ గవాయ్‌పై దాడికి నిరసనగా ర్యాలీ చేపట్టనున్నట్లు స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలు పేర్కొన్నారు.

సమర్థులతో పార్టీ కమిటీల నియామకం



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

- మాజీ ఎమ్మెల్యే శివకుమార్
- వైఎస్సార్ సీపీ ఒకటో వార్డు ముఖ్యనేతలతో సమావేశం

తెనాలి: రానున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో వార్డు/గ్రామ/మండల కమిటీలదే రాజ్యమని పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. సమర్థులు, ప్రజలకు అందుబాటులో వుండేవారితో కమిటీలను నియమించుకుంటే అటు పార్టీ బలోపేతం అవుతుందనీ, ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. పార్టీ వార్డు/గ్రామ కమిటీల నియామకంలో భాగంగా బుధవారం రాత్రి స్థానిక ఒకటో వార్డులో ముఖ్యనేతల సమావేశాన్ని నియమించారు. ఒకటో వార్డు కౌన్సిలరు, పార్టీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు గెడ్డటి సురేంద్ర అధ్యక్షత వహించారు. శివకుమార్ మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ ఐదేళ్లపాలనలో దేశంలో మరెక్కడా లేనివిధంగా ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందిందన్నారు. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈసారి పార్టీ నిర్మాణ దశలోనే భవిష్యత్‌కు సంబంధించిన సిస్టమ్‌ను అమల్లోకి తెచ్చారని తెలిపారు. గ్రామ, వార్డు, మండల కమిటీలు, అనుబంధ కమిటీలను పటిష్టంగా నియమించటం అందులో ఒకటన్నారు. అధికారంలోకి వచ్చాక ఆయా కమిటీలకే పరిపాలనలో నిర్ణయాధికారం ఉంటుందన్నారు. అంటే క్షేత్రస్థాయి నుంచే రాబోయే పరిపాలన జరుగుతుందని శివకుమార్ చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకొని చక్కని కమిటీలను నియమించాలనీ సూచించారు. గ్రామాలు/వార్డుల వారీగా నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం పూర్తిచేయాలని, ఆ తర్వాత మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేయాలని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడిబోయిన రమేష్, చింకా సురేష్‌చంద్ర యాదవ్, షేక్ దుబాయ్‌బాబు, కుర్రా శ్రీను, ఆవుల కోటయ్య, అక్కిదాసు కిరణ్‌కుమార్, వార్డుకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చొరవ

- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్
- పలు స్టేషన్లలో తనిఖీలు

తెనాలిరూరల్: తెనాలి ప్రాంతంలో నేరాల నియంత్రణకు, గంజాయి కట్టడి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. పట్టణంలో మంగళవారం పట్టపగలు నడిరోడ్డుపై ఓ వ్యక్తి హత్యకు గురైన నేపథ్యంలో ఎస్పీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఆయా స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్ల వివరాలు, వారి కౌన్సెలింగ్ విధానాన్ని డీఎస్పీ బి.జనార్ధనరావు ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన మీడియాతో మాట్లాడారు. తెనాలి పట్టణంలో రౌడీ షీటర్ల ఆగడాలను కట్టడి చేస్తామన్నారు. పదే పదే నేరాలకు పాల్పడితే వారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని, పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని చెప్పారు. అదేవిధంగా గంజాయి విషయంలో విక్రయించేవారు, వినియోగించే వారిపై కూడా కేసులు నమోదు చేసి, వారికి శిక్షలు పడేలా చూస్తామన్నారు. మహిళల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, పాఠశాలలు, కళాశాలల వద్ద డ్రోన్ నిఘా ఉంటుందని, నిత్యం నిఘా ఉంచేందుకు శక్తి టీమ్స్ పనిచేస్తున్నాయని చెప్పారు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే కేసులు నమోదు చేసి, 60 రోజులలో ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని, కఠిన శిక్షలు అమలయ్యేలా చర్యలు ఉంటాయన్నారు.



వన్‌టౌన్ స్టేషన్ ఆవరణలోని వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ జిందాల్

- రాత్రిళ్లు మద్యం సేవించి, అనవసరంగా తిరిగి, అల్లర్లు సృష్టించే వారిపై కేసులు నమోదు చేస్తామని, రాత్రి వేళలో పోలీస్ బీట్ పెంచుతామన్నారు. ఇటీవల సైబర్ నేరాలు కూడా పెరిగిపోయాయని, వివిధ రూపాలలో బెదిరించి బ్యాంకు ఖాతాలోని సొమ్మును కాజేస్తున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి సమస్య ఎదురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలన్నారు. ఫలితంగా నగదు బదిలీ అయిన ఖాతాలను సీజ్ చేసి, బాధితులకు తిరిగి ఇప్పించే అవకాశం ఉంటుందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ విషయం ఉన్నతాధికారులకు నివేదించామని స్పష్టం చేశారు. ఏదేమైనా తెనాలి, పరిసర ప్రాంతాలు సురక్షితంగా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ చెప్పారు. ఆయన వెంట డీఎస్పీ బి. జనార్ధనరావు, వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు, త్రీ టౌన్ సీఐ ఎస్. సాంబశివరావు, రూరల్ సీఐ ఆర్. ఉమేష్ ఉన్నారు.

విధులకు సకాలంలో హాజరు కావాలి

మున్సిపల్ కమిషనర్ జేఆర్ అప్పలనాయుడు

తెనాలిఅర్బన్: విధులకు సకాలంలో హాజరుకావాలని మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడు సూచించారు. 9వ పారిశుద్ధ్య డివిజన్ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేసి, అంటెడెన్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. అవిరాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం 25వ వార్డులో అసంపూర్తిగా ఉన్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించి వెంటనే దానిని ఉపయోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం 28వ వార్డులోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించి దాని వివరాలు అడిగి తెసుకున్నారు. వెంటనే దానిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు

అసభ్య ప్రవర్తన కేసులో జరిమానా

తెనాలిరూరల్: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సోమసుందరపాలెంకు చెందిన మహిళతో ఆమె బావ వెంకటసుబ్బారావు 2021లో అసభ్యంగా ప్రవర్తించాడు. అంతటితో ఆగకుండా లైంగిక వేధింపులకు గురి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ హెడ్‌కానిస్టేబుల్ మేకల రమేష్ కేసు నమోదు చేయగా, ఎస్‌ఐ ప్రసన్నకుమార్ చార్జ్‌షీట్ దాఖలు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. కేసు బుధవారం విచారణకు రాగా సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రధాన సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) ఆకా పవన్‌కుమార్ నిందితుడికి రూ.రెండు వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

వరిగట్లపై కూరగాయల మొక్కలతో లాభాలు

నాలుగు గ్రామాల్లో ప్రకృతి పంటలను పరిశీలించిన అధికారులు

కొల్లిపర: రైతులు వరిపైరుతో పాటుగా పొలం గట్లుపై కూరగాయల మొక్కలు పెంచుకుంటే రైతులకు అధిక ఆదాయం మరియు ఆరోగ్యం లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సీనియర్ టెక్నికల్ లీడ్ గోపీచంద్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారిలు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని దావులూరు, కొల్లిపర, చివలూరు మరియు అత్తోట గ్రామాలలో పర్యటించి జీవవైవిధ్య పంటల వలన ప్రధాన పంటకు చీడపీడల నివారణ జరుగుతుందని తెలియజేశారు. రైతులతో అనేక విషయాలపై చర్చించారు. చివలూరు గ్రామంలో వరి గట్లపై అన్నీ రకాల కూరగాయలు, బంతి పూలుసాగు చేస్తున్న రైతు దూసరి రాజారావును అభినందించారు.



చివలూరులో వరిగట్లపై సాగు చేస్తున్న పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

ప్రజాసేవలో రోటరీ క్లబ్ ముందంజ

రోటరీ డిస్ట్రిక్ట్-3150 గవర్నర్ డాక్టర్ ఎస్వీ రామ్‌ప్రసాద్

తెనాలి: ప్రజల అవసరాలను గుర్తించి, అందుకనుగుణమైన సేవలను అందించటంలో తెనాలి రోటరీ క్లబ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని రోటరీ డిస్ట్రిక్ట్-3150 గవర్నర్ డాక్టర్ ఎస్వీ రామ్‌ప్రసాద్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అయితానగర్‌లోని అపర కర్మశాలకు కావాల్సిన 60 కుర్చీలు, అయిదు డైనింగ్ టేబుల్స్‌ను సమకూర్చారు. అపర కర్మశాల కమిటీకి డిస్ట్రిక్ట్ గవర్నర్ రామ్‌ప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు సంస్థ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా అయితానగర్‌లోని హిందూ స్మశానవాటికి వద్ద 37 మొక్కలను నాటారు. ఈ ఏడాదిలోపు కోటి మొక్కలను నాటి సంరక్షించాలనే సంకల్పంతో రోటరీ పనిచేస్తోందని డాక్టర్ ఎస్వీ రామ్‌ప్రసాద్ చెప్పారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, డిస్ట్రిక్ట్ కేబినెట్ సభ్యుడు కన్నెగంటి మురళీకృష్ణ, అపర కర్మశాల కమిటీ సభ్యులు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.



అపర కర్మశాలకు కుర్చీలు, టేబుళ్లు పంపిణీ చేస్తున్న రామ్‌ప్రసాద్

ఇనుము దొంగల అరెస్టు

మంగళగిరి టౌన్: నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద ఐరన్ సామగ్రి చోరీకి పాల్పడుతున్న నిందితులను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై సి.హెచ్.వెంకట్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న కురగల్లు గ్రామంలో బీఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించి సుమారు రూ. 2 లక్షల విలువ చేసే సామగ్రి చోరీ జరిగిందన్నారు. విజయవాడ ఇబ్రహీంపట్నంకు చెందిన చల్లా జగదీష్, గణేష్, దుర్గారావు, మరో ఇరువురు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలందరికీ రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, పెనుమాక నాయకులు ఎస్‌కే పీరు సాహెబ్, ఎస్‌కే ఖాదర్ బాబా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజధానిలో భాగమైన పెనుమాక గ్రామంలో బుధవారం ఇళ్ల స్థలాలు కోసం సీపీఎం కార్యకర్తలు అర్జీలు సేకరించారు. ఎంటీఎంసీ పరిధిలో స్థలాలు లేని పేదలందరికీ ప్రభుత్వ హామీ మేరకు రెండు సెంట్లు ఇచ్చి, ఇల్లు నిర్మించుకునేందుకు రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లపై లబ్ధిదారులు అయిష్టత వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ నెల 17న మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొని అర్జీలు అధికారులకు అందజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ ఎర్రా పీరు, షేక్ ఖాదర్ బాబా తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో సీపీఎం నేతలు, స్థానికులు

బీచ్ వాలీబాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కళ్లం వెంకటరెడ్డి హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. వారిని బుధవారం ప్రధానోపాధ్యాయుడు తాతిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. తాతిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్ అమరావతి వాలీబాల్ అకాడమీ పోటీలకు పాఠశాల నుంచి వీరు ఎంపికయ్యారని చెప్పారు. అండర్-19 విభాగంలో తొమ్మిది తరగతి చదువుతున్న ఎం. అజయ్, 7వ తరగతి చదువుతున్న పి.మహిత ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 20 నుంచి బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. దీనికి సహరించిన పీడీ కె.రజినీనాయక్, ఇతర ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.



గోశాల తరలించాలని ఆందోళన



అనంతవరం (తాడికొండ): తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామంలో అనుమతులు లేకుండా గోశాల నిర్వహిస్తున్నందున దానిని తరలించాలని బీజేపీ, వీహెచ్‌పీ నాయకులతోపాటు గ్రామస్తులు పలువురు ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వ స్థలంలో కొనసాగుతున్న ఈ గోశాలలో గోవులకు సరైన పోషణ అందించడం లేదని వారు ఆరోపించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పశు సంవర్ధక శాఖ అధికారిణి రేణుకాదేవి గతంలో నోటీసులు జారీ చేసినా తరలింపునకు చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో బుధవారం మరోమారు నిరసన తెలిపామని పేర్కొన్నారు.

అలరించిన అన్నమాచార్య సంకీర్తన లహరి

నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై బుధవారం అన్నమాచార్య సంకీర్తన లహరి నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ పాలక మండలి వారు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. భారత పూర్వ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కలాం జీవిత విశేషాలు, విజయాలను ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి వివరించారు. అనంతరం డాక్టర్ జె.కృష్ణకుమారి పర్యవేక్షణలో మోహనగానం వైకుంఠమే సంస్థ సభ్యులు అన్నమాచార్య కీర్తనలు అలపించారు.

ఈ- పంట నమోదు వేగంగా పూర్తి చేయాలి

తాడికొండ: ఈ- పంట నమోదు వేగవంతంగా పూర్తిచేయాలని మంగళగిరి వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తాడికొండ వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆర్‌బీకే సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు పండించిన పంటలను ఈ -పంట నమోదులో నూరుశాతం పూర్తిచేయాలన్నారు. పంట కోత అనంతర ప్రయోగాలు, దిగుబడి అంచనాలు రూపొందించాలని సూచించారు. రైతులకు సరిపడా ఎరువులు సకాలంలో అందేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఏవో బి శ్రీనివాస నాయక్, ఏఈవో కృష్ణా రావు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.